క్లుప్తంగా

ప్రజావేదికను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న డీఆర్పీ రజిత

సుల్తానాబాద్‌: గ్రామాల్లో జరిగే ఈజీఎస్‌ సోషల్‌ ఆడిట్‌ను కూలీలు వినియోగించుకోవాలని ఈజీఎస్‌ సోషల్‌ ఆడిట్‌ ఎస్‌ఆర్పీ తిరుపతి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామాలకు వెళ్లే సోషల్‌ ఆడిటర్లకు శిక్షణ ఇచ్చారు. ఈనెల 5 నుంచి 14 వరకు గ్రామాల్లో సోషల్‌ ఆడిట్‌ జరుగుతుందన్నారు. డీఆర్పీలు రజిత, అశోక్‌, శివకృష్ణ, మోతిలాల్‌, చంద్రశేఖర్‌, కార్తీక్‌, సమీర్‌, చందు పాల్గొన్నారు.

నేడు వీడియో కాన్ఫరెన్స్‌

సుల్తానాబాద్‌: జిల్లావ్యాప్తంగా ఉన్న రైతు వేదికల్లో మంగళవారం ఉదయం 10 గంటలకు వీడియో కాన్ఫరెన్స్‌ ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోండి

యైటింక్లయిన్‌కాలనీ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని రామగుండం కార్పొరేషన్‌ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్‌ మాజీ కార్పొరేటర్‌ స్టాలిన్‌గౌడ్‌, బీఆర్‌ఎస్‌ నాయకురాలు మాధవి సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం

సుల్తానాబాద్‌: సుల్తానాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ మినుపాల ప్రకాశ్‌రావును జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ అంతటి అన్నయ్యగౌడ్‌, మాజీ వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ సాహిరి మహేందర్‌ సన్మానించారు.

ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

పెద్దపల్లిరూరల్‌: ఐక్యంగా ఉంటూ పోరాటాలు చేస్తూ హక్కులను సాధించుకుందామని మున్నూరు కాపు సంఘ రాష్ట్ర కన్వీనర్‌ చింతపండు మహేందర్‌, యువత రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్‌ అన్నారు. పెద్దపల్లిలో ఆదివారం నిర్వహించిన మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు మోహన్‌, మహేశ్‌, సురేశ్‌ తదితరులున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలి

కాల్వశ్రీరాంపూర్‌: ప్రజలు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలని, ఆర్థిక స్వావలంబన దిశగా అభివృద్ధి చెందాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు కొలనూర్‌ బ్రాంచి మేనేజర్‌ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. ఆశన్నపల్లె గ్రామంలో సోమవారం ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించారు. బ్యాంకు ఉద్యోగులు, సీఎస్‌ఎల్‌ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు

రామగిరి: నాగెపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులకు రూ.2వేల చొప్పున ఉపకార వేతనాన్ని సోమవారం ప్రజ్ఞా ఫౌండేషన్‌ వ్యవస్థాపకుడు కర్నె లక్ష్మీనారాయణ అందజేశారు.

పాఠశాలకు సౌండ్‌ సిస్టం వితరణ



ఓదెల: మడక గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు మాజీ ఉప సర్పంచ్‌ నంద క్రాంతి కుమార్‌ సోమవారం సౌండ్‌ సిస్టం వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయులు అశోక్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సదాశివరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

జ్యోతినగర్‌: ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణ కాలనీకి చెందిన గొడుగు శకుంతల కుటుంబానికి సోమవారం సీతారామ సేవాసమితి సభ్యులు చేయూతనందించారు. కొద్ది రోజులుగా శకుంతల, ఆమె కుమారుడు కుమార్‌ అనారోగ్యంతో బాధపడుతూ ఇంటికే పరిమితమయ్యారు. విషయం తెలుసుకున్న సీతారామ సేవాసమితి అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ సేవాసమితి సభ్యులతో కలిసి 50 కిలోల బియ్యంతోపాటు నిత్యావసర సరుకులు, కంది నాగరాజు అందించిన రూ.1,000 అందించారు.

ఆర్థిక సాయం

కమాన్‌పూర్‌: పేంచికల్‌పేట గ్రామానికి చెందిన దబ్బెట మల్లేశ్‌ తల్లి బొందెమ్మ ఇటీవల మృతి చెందగా.. మల్లేశ్‌ మిత్రులు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు.

మల్లన్న సన్నిధిలో దీపారాధన

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా దీపారాధన కార్యక్రమం జరిగింది. మల్లికార్జునస్వామిని దర్శించి టెంకాయలు కొట్టారు. భక్తులకు ఉచితంగా మట్టి ప్రమిదలు, నూనెవత్తులు పంపిణీ చేశారు.



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కమాన్‌పూర్‌: కమాన్‌పూర్‌, సిద్దపల్లె, ముల్కలపల్లి, రాజాపూర్‌, గుండారం, పేరపల్లి గ్రామాల్లో సోమవారం సెర్ఫ్‌ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్‌ వాసంతి ప్రారంభించారు. 2024–25 ఖరీఫ్‌ సీజన్‌కు సంబంధించి కనీస మద్దతు ధర క్వింటాల్‌ గ్రేడ్‌–ఏ రకానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 ధర నిర్ణయించారన్నారు. మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, ఏపీఎం శైలజారాణి, ఆర్‌ఐ గౌతమ్‌, జూనియర్‌ అసిస్టెంట్‌ కిరణ్‌, సీసీ శ్రీనివాస్‌, రైతులు పాల్గొన్నారు.

జూలపల్లి: మండలంలో రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర పొందడానికి ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించాలని మండల వ్యవసాయాధికారి ప్రత్యూష సూచించారు. సోమవారం పెద్దాపూర్‌ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఏఈవో కిరణ్మయి, కొనుగోలు కేంద్రం సిబ్బంది ఉన్నారు.


గుండారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్‌ వాసంతి

రేపటి నుంచి ఇంటింటా సర్వే

సుల్తానాబాద్‌: ఈనెల 6 నుంచి ఇంటింటా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సమగ్ర కుటుంబ కుల గణన సర్వేను జయప్రదం చేయాలని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు అన్నారు. సోమవారం ఎంపీడీవో సమావేశం మందిరంలో సిబ్బంది, వివిధ శాఖల అధికారులకు శిక్షణ ఇచ్చారు. ప్రతి దరఖాస్తులోని కాలమ్స్‌ను ఖాళీగా వదిలిపెట్టకుండా కుటుంబ సభ్యుల వివరాలతోపాటు ఆధార్‌ కార్డులు, రేషన్‌ కార్డు, భూములు, ఇళ్లు, అద్దె, ఐటీ చెల్లిస్తున్నారా, ప్రభుత్వ ఉద్యోగమా, ప్రయివేట్‌ ఉద్యోగమా, కాంట్రాక్ట్‌, అవుట్‌ సోర్సింగ్‌ ఉద్యోగమా, వారి సంవత్సర ఆదాయం, భార్యాభర్తలు ఉద్యోగాలు చేస్తున్నారా లాంటి వివరాలు తెలుసుకొని పూరించాలన్నారు. అధికారులు, ఉపాధ్యాయులున్నారు.

జూలపల్లి: కుల గణనకు సంబంధించిన కుటుంబాల లెక్క కొలిక్కి వస్తోంది. ఎన్యూమరేటర్లు ఇంటింటా తిరిగి యజమానుల పేరుతో స్టిక్కర్లను అంటిస్తున్నారు. ఈనెల 6 నుంచి సమగ్ర కుల, రాజకీయ, ఆర్థిక, ఉపాధి, సామాజిక సర్వేను చేపట్టనున్నట్లు ఎంపీవో అనిల్‌రెడ్డి తెలిపారు.


సుల్తానాబాద్‌ కార్యాలయంలో శిక్షణ ఇస్తున్న ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు

ఓదెల: మండల పరిషత్‌ కార్యాలయంలో సమగ్ర కుటుంబ సర్వేపై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో తిరుపతి, ఎంపీవో షబ్బీర్‌ ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి సమగ్ర కుటుంబ సర్వే ఏవిధంగా చేయాలో వివరించారు. మండలంలో చేపడుతున్న సమగ్ర కుటుంబ ఇంటింటా సర్వే వేగవంతమయింది. 10 మంది సూపర్‌వైజర్లు, 97 మంది ఎన్యూమరేటర్ల ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే చేస్తున్నారు.

ఖేల్‌

ఖోఖో పోటీల్లో ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న డైరెక్టర్‌ మణి

పెద్దపల్లిరూరల్‌: పట్టణంలోని అరబిందో కాకతీయ పాఠశాల విద్యార్థి ఆకుల సంపత్‌ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. సుల్తానాబాద్‌లో జరిగిన అండర్‌–17 ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. కరస్పాండెంట్‌ రమణారావు, డైరెక్టర్‌ మణి, హెచ్‌ఎం సుధాకర్‌, పీఈటీ సాయికుమార్‌, ఉపాధ్యాయులు అభినందించారు.

టేబుల్‌ టెన్నిస్‌ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్‌ సంజీవ్‌కుమార్‌

సుల్తానాబాద్‌: రాష్ట్ర టేబుల్‌ టెన్నిస్‌ పోటీలకు ఎంపికైన విద్యార్థులను సుల్తానాబాద్‌ ఐపీఎస్‌ పాఠశాలలో సోమవారం అభినందించారు. ఆదివారం జగిత్యాల జిల్లాలో జరిగిన కరీంనగర్‌ ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్‌ టేబుల్‌ టెన్నిస్‌ పోటీల్లో సుల్తానాబాద్‌ ఇండియన్‌ పబ్లిక్‌ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. కరీంనగర్‌ ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన టేబుల్‌ టెన్నిస్‌ పోటీల్లో అండర్‌–14 బాలుర విభాగంలో మొదటి బహుమతి, అండర్‌–14 బాలికల విభాగంలో రెండో బహుమతి సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. సుల్తానాబాద్‌ సెయింట్‌ మేరీ పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో అండర్‌–17 బాలికలు మొదటి బహుమతి గెలుపొందారు. కరస్పాండెంట్‌ మాటేటి సంజీవ్‌కుమార్‌, ప్రిన్సిపాల్‌ కృష్ణప్రియ అభినందించారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సెయింట్‌ మేరీస్‌ స్కూల్‌ కరెస్పాండెంట్‌ ప్రిన్సిపాల్‌ శౌరెడ్డి అన్నారు. పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


శ్రావ్యశ్రీ

ఓదెల: కొలనూర్‌ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న రేండ్ల శ్రావ్యశ్రీ రాష్ట్రస్థాయి షాట్‌పుట్‌ పోటీలకు ఎంపికైంది. సోమవారం పెద్దపల్లిలో జరిగిన స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌లో ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయిలో రెండో స్థానం కైవసం చేసుకుంది. అండర్‌–17 విభాగంలో శ్రావ్యశ్రీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది.

అబాకస్‌లో విద్యార్థిని ప్రతిభ


ట్రోఫీ అందుకుంటున్న ఆరాధ్య

జ్యోతినగర్‌: అబాకస్‌ రాష్ట్రస్థాయి పోటీల్లో ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లోని మాతృమందిర్‌ పాఠశాల విద్యార్థిని కావేటి ఆరాధ్య ప్రతిభ కనబర్చి ట్రోఫీ అందుకుంది. హైదరాబాద్‌లో జరిగిన యూసీమాస్‌–2024 పోటీల్లో మాతృమందిర్‌ స్కూల్‌లో ఐదోతరగతి విద్యనభ్యసిస్తున్న ఆరాధ్య నిర్వాహకుల చేతుల మీదుగా ట్రోఫీ అందుకుంది.

మీసేవ ఆపరేటర్లకు అండగా ఉంటాం

పెద్దపల్లిరూరల్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం మీసేవ ఆపరేటర్లకు అండగా ఉంటుందని, వారి సంక్షేమం కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారని మీసేవ ఆపరేటర్ల సంఘం మండల అధ్యక్షుడు మిట్టపల్లి శ్రీనివాస్‌ తెలిపారు. పెద్దపల్లి నుంచి మీసేవ నిర్వాహకులు సోమవారం హైదరాబాద్‌లో జరిగిన వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మంత్రిని కలిశారు.


మంత్రి శ్రీధర్‌బాబుతో మీసేవ ఆపరేటర్లు

మంత్రిని కలిసిన బీసీ సంఘ నేత

పెద్దపల్లిరూరల్‌: బీసీలకు మేలు చేసేందుకే తమ ప్రభుత్వం కుల గణన చేపట్టిందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారని బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడూరి శ్రీమన్నారాయణ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో సోమవారం మంత్రిని కలిసినట్లు చెప్పారు.

‘పుడా’ ఏర్పాటుకు మద్దతివ్వండి

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లి అభివృద్ధి కోసం పుడా ఏర్పాటు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచేందుకు వీలుగా మున్సిపల్‌ సర్వసభ్య సమావేశంలో తీర్మానించి పుడా సాధన సమితికి మద్దతివ్వాలని సాధన సమితి నాయకులు బి.రమేశ్‌గౌడ్‌, బొంకూరి సురేందర్‌సన్నీ కోరారు. సోమవారం మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మమతారెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు.

పుడా సాధన కోసం చేపట్టిన ఉద్యమంలో భాగంగా పెద్దపల్లి పట్టణ బంద్‌కు వాణిజ్య, వ్యాపారులు సహకరించాలని సాధన సమితి నాయకులు చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ అధ్యక్షుడు కమల్‌కిషోర్‌ శారడ, కార్యదర్శి మస్రత్‌, కోశాధికారి వినోద్‌ను కలిసి మద్దతివ్వాలని కోరారు. కావేటి రాజ్‌గోపాల్‌, రామగిరి చంద్రమౌళి, పల్లె సదానందం, జాహెద్‌ హుస్సేన్‌, మంద భాస్కర్‌, రవి, రామ్మూర్తి, రాజేందర్‌, కరుణాకర్‌, అంజయ్య, శేఖర్‌ తదితరులున్నారు.

ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి

పెద్దపల్లిరూరల్‌: పెద్దబొంకూర్‌ ప్రాంతంలో అమాయకుల భూములను ఫోర్జరీ సంతకాలతో మోసం చేసి కబ్జాలు చేసిన వారి అక్రమాలను సమాచార హక్కు చట్టంతో వెలికి తీస్తున్నాననే అక్కసుతో తనను హతమార్చేందుకు యత్నిస్తున్నారని పెద్దబొంకూరు గ్రామానికి చెందిన మిట్టపల్లి వెంకటేశం తెలిపారు. సోమవారం అడిషనల్‌ కలెక్టర్‌ వేణును కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని వేడుకున్నట్లు తెలిపారు.

పోలీసుల అదుపులో మాజీ సర్పంచులు

మంథని: పెండింగ్‌ బిల్లులు చెల్లించాలనే డిమాండ్‌తో మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఇచ్చిన చలో హైదరాబాద్‌కు తరలి వెళ్లకుండా సోమవారం మంథనిలో పోలీసులు బీఆర్‌ఎస్‌ పార్టీకి చెందిన మాజీ సర్పంచులు, మాజీ సర్పంచుల భర్తలను అదుపులోకి తీసుకున్నారు. శాంతియుతంగా ధర్నాకు వెళ్తున్న తమను ముందస్తుగా అరెస్టు చేయడం సరికాదని మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌ అన్నారు.

ఆధ్యాత్మికం

రుద్రాభిషేకం

సుల్తానాబాద్‌: మండల కేంద్రంలోని శివాలయం, వేణుగోపాలస్వామి ఆలయం, సాంబశివాలయం, రాజరాజేశ్వరాలయం, శంభుని ఆలయాల్లో కార్తీక మాసం సందర్భంగా సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. 108 కొబ్బరికాయలతో రుద్రాభిషేకాన్ని పారిశ్రామికవేత్త పల్ల పల్లవి–శివకుమార్‌ దంపతులు నిర్వహించారు.

ఎలిగేడు: మండల కేంద్రంలోని శ్రీభవానిరామలింగేశ్వర ఆలయంలో శివలింగానికి ఆలయ అర్చకుడు చెగ్యాము దయాకర్‌ అభిషేకం నిర్వహించారు.

అన్నదానం

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో నల్ల ఫౌండేషన్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల మనోహర్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ పాటకుల అనిల్‌ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు.

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీలోని రాణిరుద్రమదేవి సర్కిల్‌ చౌరస్తా వద్ద మహిళలు సోమవారం పారిశుద్ధ్య కార్మికులకు అన్నదానం చేశారు. చౌరస్తా వద్ద నెలకొల్పిన దుర్గామాత అమ్మవారికి సమర్పించిన ఒడిబియ్యాన్ని కాలనీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులతోపాటు ఆ ఏరియా వాసులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

నేడు మంథనికి అయోధ్య రామ యంత్ర రథయాత్ర

మంథని: అయోధ్యలో ప్రతిష్ఠించబోయే రామ యంత్ర రథయాత్ర మంగళవారం మంథనికి చేరుతుందని రామ యంత్ర రథయాత్ర కో–ఆర్డినేటర్‌ బొబ్బిలి శ్రీధర్‌ తెలిపారు. జగద్గురు కంచి పీఠాధిపతి ఆజ్ఞ మేరకు కంచి నుంచి అయోధ్య వరకు 150 కిలోల బంగారు పూతతో తయారు చేసిన రామ యంత్ర యాత్ర మంథనికి సాయంత్రం వస్తుందన్నారు.

వాసవీ ఆలయంలో కార్తీక దీపాలు

కాల్వశ్రీరాంపూర్‌: కాల్వశ్రీరాంపూర్‌ శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకొని సోమవారం కార్తీక దీపాలు వెలిగించారు. మహిళలు మంగళ హారతులిచ్చారు. స్థానిక శివాలయం, రామాలయం, కృష్ణాలయం, హరిహర క్షేత్రం, మీర్జంపేట రామాలయం, పెగడపల్లి విశ్వేశ్వరాలయం, మంగపేట చంద్రశేఖరాలయం, మడిపెల్లి మహాలింగేశ్వరాలయం, కిష్టంపేట రామాలయం, కూనారం నరసింహ ఆలయంలో భక్తులు దీపాలు వెలిగించారు.

నియామకం

చేనేత ఐక్యవేదిక జిల్లా అధికార ప్రతినిధిగా తిరుపతి



జ్యోతినగర్‌: తెలంగాణ చేనేత ఐక్యవేదిక జిల్లా అధికార ప్రతినిధిగా ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీకి చెందిన దాసరి తిరుపతిని నియమించారు. జిల్లా అధ్యక్షుడు ఆడెపు శంకర్‌ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రచార కార్యదర్శిగా కృష్ణ



రామగిరి: తెలంగాణ చేనేత ఐక్యవేదిక జిల్లా ప్రచార కార్యదర్శిగా నాగెపల్లి గ్రామానికి చెందిన సింగరేణి కార్మికుడు తాటిపాముల కృష్ణ నియామకమయ్యారు.

చెత్త తొలగించిన సిబ్బంది



సాక్షి స్పందన

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్‌ 39వ డివిజన్‌ గౌతమినగర్‌ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో రోడ్డుపై డ్రైనేజీ లేక మురుగునీరు ప్రవహిస్తోంది. సోమవారం సాక్షిలో కథనం ప్రచురితమవడంతో స్పందించిన రామగుండం నగరపాలక సంస్థ శానిటరీ అధికారులు డ్రైనేజీ పైపులైన్‌లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామగిరి: నాగెపల్లి గ్రామ శ్మశాన వాటిక వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జయశంకర్‌ భూపాల్‌పల్లి జిల్లా కాటారం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన చిట్యాల సమ్మయ్య(45) మృతిచెందాడు. రామగిరి పోలీసుల వివరాల ప్రకారం.. సమ్మయ్య ఆదివారం తన బావమరిది అయిన ఇందారపు మహేందర్‌ కుటుంబ పంచాయితీ విషయంలో భూపాల్‌పల్లి జిల్లా కోయ్యూరుకి వెళ్లి తన బంధువు అయిన రామగిరి మండలం బేగంపేట గ్రామానికి చెందిన మారుపాక రాజేశ్‌ బైక్‌పై బేగంపేటకు వస్తున్నాడు. నాగెపల్లి, లద్నాపూర్‌ గ్రామాల మధ్య ఆదివారం సాయంత్రం మారుపాక రాజేశ్‌ అతివేగంగా, అజాగ్రత్తగా బైక్‌ నడపడంతో.. బైక్‌ అదుపుతప్పి కింద పడిపోయాడు. బైక్‌ వెనకాల కూర్చున్న సమ్మయ్య తలకు గాయాలు కాగా.. 108లో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతిచెందాడు. మృతురాలి భార్య చిట్యాల సుగుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పెట్టం చంద్రకుమార్‌ తెలిపారు.

పెద్దపల్లిరూరల్‌: నిట్టూరులోని గౌండ్లవాడలో నడిరోడ్డుపై విద్యుత్‌ స్తంభం ఉండడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏడాది గడచినా ఇప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.



సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రవీందర్‌, ఏఈ, ట్రాన్స్‌కో, సెల్‌ నం.: 9490610255

వాట్సాప్‌ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్‌ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్‌ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

లక్ష్యాల సాధనలో ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలి

గోదావరిఖని: బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని కార్పొరేట్‌ ప్రాజెక్టు ప్లానింగ్‌ జీఎం ఎ.మనోహర్‌ పేర్కొన్నారు. సోమవారం ఆర్జీ–1 జీఎం కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, బొగ్గు రవాణా, ఓవర్‌ బర్డెన్‌ వెలికితీత, రక్షణ, సివిల్‌, పర్సనల్‌ సంబంధించిన విభాగాల అధికారులతో చర్చించారు. నవంబర్‌ నెలలో సాధించాల్సిన బొగ్గు ఉత్పత్తిపై దిశానిర్దేశం చేశారు. ఏజెంట్‌ చిలక శ్రీనివాస్‌, జీడీకే–5 ఓసీపీ ప్రాజెక్టు అధికారి కె.చంద్రశేఖర్‌, ఆంజనేయులు, ఆంజనేయప్రసాద్‌, అనిల్‌గబాలే, రమేశ్‌కుమార్‌, అల్లాఉద్దీన్‌, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మనోహర్‌

అందరి సహకారంతో క్వార్టర్ల కూల్చివేత

గోదావరిఖని: అన్ని వర్గాల సహకారంతో క్వార్టర్ల కూల్చివేత సజావుగా సాగుతోందని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్‌ పేర్కొన్నారు. సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ రాజ్‌ఠాకూర్‌ ప్రతిపాదన మేరకు సీఅండ్‌ఎండీ ఎన్‌.బలరాం ఆదేశాల మేరకు కూల్చివేత కొనసాగుతోందన్నారు. పట్టణ అభివృద్ధిలో 83 క్వార్టర్ల కూల్చివేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా సోమవారం చౌరస్తా సమీపంలోని బీఆర్‌ఎస్‌ కార్యాలయానికి చెందిన 147, 148 నంబర్‌ క్వార్టర్స్‌ కూల్చివేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 23 క్వార్టర్ల కూల్చివేత పూర్తయినట్లు తెలిపారు.


మాట్లాడుతున్న ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్‌

మైనింగ్‌ లీజ్‌ భూముల సమస్యలను పరిష్కరిస్తాం

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామమైన ఓసీపీ–5 ప్రాజెక్ట్‌ పరిధిలోని సుందిళ్ల గ్రామ రైతుల మైనింగ్‌ లీజ్‌ భూముల సమస్యలను పరిష్కరిస్తామని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్‌ అన్నారు. సోమవారం సుందిళ్ల శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయ కమ్యూనిటీ హాల్‌లో మైనింగ్‌ లీజ్‌ భూనిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామ రైతులతో మైనింగ్‌ లీజ్‌ భూముల పరిహారం చెల్లింపులకు ఏర్పడిన సమస్యలను గుర్తించి రెవెన్యూ, సింగరేణి అధికారులు, గ్రామ పెద్దలతో కలిసి ఒక కమిటీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జీడీకే కోల్‌మైన్‌ ప్రాజెక్ట్‌ ఆఫీసర్‌ చంద్రశేఖర్‌, డీజీఎం ఎస్టేట్‌ కుమారస్వామి, అనిల్‌, సర్వే అధికారి ప్రభాకర్‌, సింగరేణి ఇతర అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జీడీకే–11 గనికి తారు రోడ్డు వేయాలి

గోదావరిఖని: గోదావరిఖని నుంచి జీడీకే–11 గనికి వెళ్లేందుకు తారు రోడ్డు నిర్మించాలని కార్మికులు కోరుతున్నారు. విధులకు హాజరయ్యే కార్మికులు ప్రతిరోజు ఈ రోడ్డు వెంట ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. వర్షాలు కురిసిన సమయంలో రోడ్డు బురదమయంగా మారడంతో డ్యూటీకి ద్విచక్ర వాహనాలపై వెళ్లే కార్మికులు అదుపుతప్పి కింద పడి గాయాలపాలవుతున్నారని వాపోయారు.


ప్రస్తుతమున్న మట్టి రోడ్డు

అండర్‌ గ్రౌండ్‌ అలవెన్స్‌ తిరిగి ఇప్పిస్తాం

గోదావరిఖని: సింగరేణి కార్మికుల వేతనాల్లో కోత విధించిన అండర్‌ గ్రౌండ్‌ అలవెన్స్‌ తిరిగి ఇప్పిస్తామని ఏఐటీయూసీ నాయకుడు రవీందర్‌ పేర్కొన్నారు. సోమవారం వకీల్‌పల్లి గనిలో ఏర్పాటు చేసిన గేట్‌ మీటింగ్‌లో మాట్లాడారు. సంస్థ అవసరాల కోసం అండర్‌ గ్రౌండ్‌ కార్మికులను సర్ఫేస్‌లో ప్రతి గనిలో వాడుకోవడం సర్వసాధారణమన్నారు. అండర్‌ గ్రౌండ్‌ అలవెన్స్‌ చెల్లించడం కూడా మామూలుగా జరుగుతోందని అన్నారు.

పరామర్శ

సుల్తానాబాద్‌: మున్సిపల్‌ పరిధిలోని గాంధీనగర్‌కు చెందిన కాంగ్రెస్‌ నాయకుడు, మాజీ ఎంపీటీసీ పల్లా సురేశ్‌ తల్లిదండ్రులు పల్ల సరోజన, సత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. కుటుంబ సభ్యులను స్థానిక సంస్థల ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాద్‌రావు పరామర్శించారు.

ఎలిగేడు: బుర్హాన్‌మియాపేట గ్రామానికి చెందిన ఎలిగేడు సింగిల్‌విండో మాజీ చైర్మన్‌ గోదల శ్రీనివాసరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బుర్హాన్‌మియాపేటలో శ్రీనివాసరెడ్డి కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్సీ భానుప్రసాదరావు పరామర్శించారు.

చికిత్స పొందుతూ మృతి

కాల్వశ్రీరాంపూర్‌: మల్యాల గ్రామానికి చెందిన పంది మధుకర్‌(30) ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మధుకర్‌ విజయవాడలో ఓ సబ్బుల కంపెనీలో అప్పు చేసి రూ.మూడున్నర లక్షలు వెచ్చించి హమాలీ పనిలో చేరాడు. కూలి డబ్బులు సరిపోకపోవడంతో రెండున్నర లక్షలకు ఆ పని మరొకరికి అమ్ముకొని తిరిగి ఇంటికి చేరుకున్నాడు. పని కోల్పోయి అప్పు చెల్లించలేక మద్యానికి అలవాటు పడ్డాడు. తాగొద్దని భార్య వారించడంతో అక్టోబర్‌ 30న పురుగుల మందు తాగాడు.